# పరీక్షిత్తు

అయోధ్యను పాలించే సూర్యవంశపు రాజు పరీక్షిత్తు పరిపాలనాదక్షుడు, ప్రజారంజకుడు.

సమీపారణ్యాలలో మృగయావినోదుడై సంచరించటం అతనికి అలవాటు.

ఒకసారి తను స్వారీ చేయనున్న గుర్రాన్ని చూశాడు పరీక్షిత్తు. బాగా బలిసి, నిగ నిగలాడుతోంది. దుర్గమారణ్యాలలో ఎంత వేగంగా అది పరుగెత్త గలదో. అతనికి అనుభవంలో ఉన్న విషయమే.

ఆ అరణ్య ప్రాంతమంతా వేగంగా దూకుతూ గుర్రం పరుగెడుతుంటే, అతని మనసు అంతకన్నా వేగంగా ముందుకు పరుగులు తీసింది. అమితోత్సాహంతో తన విజయానికి ఎదురు లేనట్లుగా, ఎన్నో క్రూర మృగాల్ని వేటాడి, వేటాడి సాంద్రారణ్య మధ్యంలో వృక్షచ్ఛాయన విశ్రాంతి తీసుకుంటున్నాడు పరీక్షిన్మహారాజు.

గుర్రాన్ని చెట్టుకు కట్టి ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తున్న మహారాజు తన కళ్ళను తాను నమ్మలేకపోయాడు. సమీపంలో ఉన్న పొదరింటి వైపు నుంచి చూపు మరల్చుకోలేకపోయాడు.

అపురూప లావణ్యవతి సుగంధాలు వెదజల్లే పూలను ఏరి ఏరి కోస్తోంది. పొదరింటి నుంచి తుమ్మెదల ఝుంకారం మధురంగా వినిపిస్తోంది. ఆమె ఒక్కో అడుగు ఎంతో వయ్యారంగా ముందుకు వేస్తోంది.

ఆ ప్రాంతంలో పూల మధ్య పూలలో పూవై, తీగల్లో తీగై కలిసిపోయిందా లావణ్యవతి.

పరీక్షిత్తు ఆమెను ఆపాదమస్తకం పరిశీలిస్తున్నాడు. ఈ కీకారణ్యంలో ఒంటరిగా ఈ స్త్రీ ఎందుకు సంచరిస్తోందో అర్థం కాలేదు. ఆమె సౌందర్యం అతన్ని అనిమిషుణ్ణి చేస్తోంది. మన్మథ ప్రేరణతో మహారాజు ఆమెవైపు అడుగులు వేశాడు.

ఆమె ఆ మహారాజు రూపానికి విస్తుపోతోంది. అతని ముఖంలో రాజఠీవి, నడకలో హుందాతనం, చూపుల్లో వాడితనం ఆమెను అక్కడినుండి కదలనీయకుండా బంధించాయి.

ఆమె అతన్ని క్రీగంట చూస్తోంది. మరు నిముషంలో అతని చూపుల్లో చూపులు నిలిపింది, ఆమె చూపే చొరవకి, ఆమెలోని ఆకర్షణకి అర్థం తెలుసుకోలేకపోతున్నాడు పరీక్షిత్తు. స్త్రీ సహజంగా కనబరిచే సిగ్గు కనపర్చకపోగా, కళ్ళతో మహారాజును కవ్విస్తుంటే, చిత్రమైన అనుభూతి కలిగింది అతనికి.

"ఎవరిదానవు? ఈ అరణ్యంలో ఒంటరిగా సంచరిస్తున్నా వెందుకు?"- పరీక్షిత్తు ఆమెను సమీపించి ప్రశ్నించాడు.

ఆమె కిల కిలా నవ్వింది. ఆ నవ్వుకి అతని హృదయవీణ తంత్రులు మీటినట్లే అనిపించింది. అలా నవ్వుతూంటే ఆమె చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి. ఆమె ఎర్రని పెదవులు మరీ మనోహరంగా కనిపించాయి. ఆమె నుదుట పడుతున్న ముంగురులు సరిచేసుకుంటూ మహారాజు వంక చూసింది.

"నా తండ్రి అనుమతిపై నేను వరాన్వేషణ కోసం తిరుగుతున్నాను." ఆమె అతని వంక రెప్ప వాల్చకుండా చూస్తోంది.

ఈ మాట పరీక్షిత్తుకు మరీ ఆశ్చర్యాన్ని కలిగించింది.

"వరాన్వేషణమా?"

"అవును-వరాన్వేషణమే. నేను ఎవరిదాన నవుతానో, ఏమో మరి!" ఆమె కవ్వింపు మాటలు, చేష్టలు మహారాజుకి మతి పోగొడుతున్నాయి. ప్రగల్భ వచనాలు పలుకుతూ ఆమె నల్లని వాల్జడను ముందుకు వేసుకుంది. గుండ్రటి కళ్ళు తిప్పుతూ "నేను ఎవరిదాన నవుతానో?" అంది రెట్టిస్తూ పరీక్షిత్తును చూస్తూ.

ఆమె చూపుల్లో కొంటెతనముంది. ముగ్ధమనోహరత్వముంది. ఆ చూపుల్లో ప్రేమ సంకేత ముంది. అనిర్వచనీయమైన ఆరాధన ఉంది. పరీక్షిత్తు ఆమె వలపు వలలో చిక్కుకుపోయాడు. ఈమె తన హృదయేశ్వరి అయితే ఎంత భాగ్యం తనకి లభించినట్లో అని ఊహించుకుంటూ-

"నీవు చేస్తున్న వరాన్వేషణకి ఇక ముగింపు పొడచ్చుగా?" అన్నాడు.

ఆ మాటకి తల వంచి చిరునవ్వు నవ్వింది.

పరీక్షిత్తు తన ప్రేమను దాచుకోలేక చెప్పేశాడు.

ఆమె అతని వంక తిరిగి ''నిన్ను పరిస్తాను...కానీ-''

''కానీ? చెప్పు''-పరీక్షిత్తు తొందర చేశాడు.

''నన్ను ఎప్పుడూ నీతో జలక్రీడ లాడమని కోరకూడదు.''

''ఓ ఇంతేనా? నీకు ఇష్టం లేని పని ఏదీ నీచేత చేయించను.''

సుశోభన ప్రేమానురాగాలతో తన జీవితం తరిస్తుందని ఆనందపరవశు డవుతూ, ఆమెను తోడ్కొని పురానికి చేరాడు పరీక్షిత్తు.

ఆ పురవాసులంతా సుశోభనా పరీక్షిత్తుల వివాహ వేడుకలు వైభవో పేతంగా జరుపుకున్నారు.

కాలం గడుస్తోంది. అన్యోన్యానురాగంతో రాజదంపతుల వైవాహిక జీవితం మధురాతి మధురంగా గడిచిపోతోంది.

తటాక తీరంలో, ఉద్యానవన ప్రాంతాన రాజప్రసాదం నిర్మించుకున్నాడు పరీక్షిత్తు. తన భార్య శోభనతో ఆ ఉద్యాన విహారం చేస్తూ, లౌకిక తాపత్రయాలను విస్మరించాడు.

ఆనాడు కొలనులో దిగిన మహారాజు ఎంతో సేపు ఆ నీటిలో మునిగి శరీరానికి పట్టిన స్వేద బాధను తొలగించుకున్నాడు. తనతోబాటు తన భార్యా ఈ కొలనులో దిగి స్నానం చేస్తే ఆమె శరీరానికి విశ్రాంతి కలుగుతుందని క్షణం క్షణం అతని కనిపించింది.

ఆ కొలనులో నీరు అతి చల్లగా ఉంది. అతనికి మహానందాన్ని కలిగించింది. కొలను గట్టున నిలబడి భర్తను చూస్తోంది సుశోభన. కొలనులో దిగి జలక్రీడ లాడమని ఆమెని కోరాడు ఉత్సాహంగా.

మందస్మితం ఆమె పెదాలపై నిల్చింది. ఒక్క క్షణం అలా నిల్చుని, వెంటనే కొలనులో దిగింది సుశోభన.

కొలనులో దిగిన మరు నిముషంలోనే ఆమె అదృశ్యమైంది. పరీక్షిత్తు ఆమె కోసం ఎంతో వెతికాడు. కానీ ఆమె జాడలేదు.

ఈ విపత్సంఘటనతో భార్యావియోగాన్ని భరించలేక క్రుశించి పోయాడు పరీక్షిత్తు.

కొలనంతా గాలింపించాడు సుశోభన జాడలేదు. కొలనులోని నీరంతా తోడించాడు. ఆ కొలను నుంచి కప్పలు బయటపడ్డాయి. ఈ కప్పలు భార్యని తినేసి ఉంటాయనే భావంతో, పరీక్షిత్తు మనసు దుఃఖపడింది.

తన ప్రేయసిని మింగిన కప్పలను, ఎక్కడెక్కడున్నా వెతికి చంపండని ఆజ్ఞాపించాడు పరీక్షిత్తు. రాజాజ్ఞను శిరసావహించారు రాజ సేవకులు.

రోజులు గడస్తున్నాయి.

విచారగ్రస్తుడైన పరీక్షిత్తు ఎదుట మహాతపస్వి నిలిచాడు ఒకనాడు.

"కప్పలపై ఎందుకు కోపం?" గంభీరంగా వినిపించింది ఆ తాపసి గొంతు పరీక్షిత్తుకు.

"అవును-కోపమే, నా భార్యను మింగిన కప్పలు ఎక్కడున్నా చావవలసిందే!" పరీక్షిత్తు గొంతులో గాద్గద్యం నిండింది.

తాపసి మనసు కరిగింది.

"ప్రభూ, సుశోభన తండ్రిని నేను. మండూక రాజును-" పరీక్షిత్తు ఒక్కసారి ఆనందోత్సాహాలతో ఉక్కిరి బిక్కిరయ్యాడు.

"అయ్యా, నా సుశోభనను నా కిప్పించండి!" వేడుకొన్నాడు పరీక్షిత్తు.

తాపసి తలుచుకోగానే సుశోభన ప్రత్యక్షమయింది.

సుశోభనను తీక్షణంగా తండ్రి చూస్తుంటే ఆమె తల వంచుకుంది.

జల ప్రవేశంతోనే తనకు మండూక రూపం కలుగుతుందని, నూతన జన్మ కలుగుతుందని, మహారాజుకి వివరంగా ముందే చెప్పకపోవడం తన కూతురు చేసిన దోషంగా తలచి, తండ్రి ఆయువు చాలా బాధ పొందాడు. ఆమె తప్పిదాన్ని మన్నించమని మహారాజుని వేడుకున్నాడు.

మహారాజుకు తన కుమార్తె మీదున్న అపారమైన అనురాగానికి సంతసిస్తూ, సుశోభనను పరీక్షిత్తుకు తిరిగి అప్పగించాడు ఆయువు.

మందస్మితురాలైన సుశోభనను చూస్తుంటే, పరీక్షిత్తు మహారాజు ముఖంలో తిరిగి ఆనందరేఖలు వెల్లివిరిశాయి.

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం :
అరణ్యపర్వం : చతుర్థాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక : 11-5-1988)